**కథ**

# మానవత్వం

ఆదుర్తి బాల

తూరుపు దిక్కున వెలుగు రేఖలు పరచుకొనే వేళ, నిశికాంత కౌగిలిలో నిదురించిన ప్రకృతి మత్తుగా కనులు తెరిచేవేళ తల్లి రెక్కల మాటున వెచ్చగా నిదురపోయిన పిట్ట పాపాయిలు చిట్టినోళ్ళు తెరచి ఆకలంటూ గోల చేస్తున్న వేళ. ఆహార సంపాదన కోసం ఉద్యుక్తమయి తల్లి పక్షులు రెక్కలు సాచి గగన వీధికి సాగేవేళ. చిగురాలను తట్టిలేపి, చిరుమొగ్గలను పలుకరించిన ఓ శీతల పవనం కిటికీలోనుండి దూసుకొచ్చి మంచుకెరటంలా శోభన వంటిని తాకింది.

బద్ధకంగా కళ్ళు తెరిచింది శోభన. అప్పుడే తెల్లవారినందుకు బాధపడింది. 'రాతి గుండె గడియారానికి కాలాన్ని ఆపడం తెలీదు' గడియారంలో టైం చూసి విసుక్కుంది శోభన. దుప్పట్లోని వెచ్చదనం ఒదులుకోవద్దంటోంది శరీరం. పక్కనే పడుకున్న భర్త వంక చూసింది. ఆరడుగుల విజయ్ హాయిగా నిద్రపోతున్నాడు. చెదిరిపోయిన క్రాఫ్ విశాలమైన నుదిటిపై పడి వింత అందాన్నిస్తోంది. చటుక్కున భర్త నుదుటిపై చుంబించింది శోభన.

''వన్స్ మోర్ ప్లీజ్'' కళ్ళు తెరవకుండానే అన్నాడు విజయ్.


''దొంగపిల్లాడు నిద్రపోటల్లేదన్నమాట''

''ఈ అల్లరిపిల్ల పక్కనుంటే నిద్రెలా పడుతుంది'' కొంటెగా అన్నాడు విజయ్.

''మీతో సరసాలు ఆడుతూ కూర్చుంటే ఇక పని అయినట్టే. అసలే ఇవాళ పనమ్మాయి రానని కూడా చెప్పింది'' మంచం దిగబోయింది శోభన.

''ఆదివారం కూడా ఏమిటోయ్ హడావిడి'' శోభన చేయి పట్టుకుని చటుక్కున ఆపేశాడు విజయ్.

అప్పుడు గుర్తొచ్చింది శోభనకి ఆ రోజు ఆదివారమని. రోజూ ఉండే ఉరుకులూ, పరుగులూ-స్కూల్ టైంకి రెడీ అవని పిల్లల్ని తిట్టడం...



పని మధ్యలో కాఫీ అడిగే విజయ్‌ని విసుక్కోవడం వంటివేమీ ఉండవని అనుకునేసరికి మనసంతా ఏదో రిలీఫ్‌గా అనిపించింది. ఆ రిలీఫ్ తెచ్చిన ఉత్సాహం, హాయి గొలిపే వాతావరణం ఎదురుగా అందమైన భర్త. అప్రయత్నంగా విజయ్‌ని వాటేసుకోబోయింది.

''పిల్లలు లేచారు'' శోభన ఉద్దేశ్యం గ్రహించి అన్నాడు విజయ్ నవ్వుతూ.

భర్తతో ప్రైవసీ మిస్ అయినందుకు పిల్లలమీద ఛర్రున కోపం వచ్చింది శోభనకి. ''ఛీ..స్కూలు ఉంటే ఏడు గంటలైనా లేవరు. ఏం కొంప మునుచుకుపోయిందని అపుడే లేచారు'' పిల్లల్ని విసుక్కుంది.

''నీ ఉద్దేశం తెలీక లేచారు పాపం. తెలిసుంటే నిద్ర రాకపోయినా కనీసం నిద్ర నటించే వాళ్ళు'' నవ్వేస్తూ అన్నాడు విజయ్.

కోపంగా మూతి బిగించి మంచం దిగింది శోభన.

''అంత కోపమెందుకోయ్ కాస్తంత నవ్వరాదూ'' అర్థించాడు విజయ్.

''రాని పనిమనిషినీ-తోమాల్సిన గిన్నెలనీ, ఉతకాల్సిన బట్టలనీ తల్చుకుంటూ చిరునవ్వులు చిందించడం నాకు చేతకాదు''

''ఆదివారమేగా మేమంతా నీకు హెల్ప్ చేస్తాంలే. ఈరోజు టిఫిను వంటా నాకొదిలేయ్'' అన్నాడు విజయ్.

''మీరా... మీరు వంట చేస్తారా? బెండకాయలు తరిగిపెట్టండీ అంటే చెక్కు తీసి తరగనా తీయకుండా తరగనా అనే రకం మీరు'' వేళాకోళం చేసింది శోభన.

''అదిగో అలాగే కించపరచకు నన్ను. నా ఆత్మగౌరవం దెబ్బతింటుంది. ముందు ఓ స్ట్రాంగ్ కాఫీ ఇచ్చి అలా హాల్లోకెళ్లి కూర్చో. నీకే టిఫెన్ కావాలంటే అది పెడతాను''

''ఓరి బాబోయ్ ఇవాళ ఏదో జరగబోతోంది. సరేలెండి. మీ ఉత్సాహాన్ని నేనెందుకు కాదనాలి. నాకు పెసరట్టు, ఉప్మా కావాలి చేసి పెడతారా''

''ఓ.యస్. పిల్లలూ మీకేం కావాలో చెప్పండి ముందు.''

''నాకు ఆమ్లెట్ కావాలి డాడీ'' అన్నది దివ్య.

''నాకు దోశ కావాలి'' అన్నాడు దీపు.

''ఇన్ని టిఫిన్లు గంటలో చేసి పెడతారా?'' ఆశ్చర్యంగా అన్నది శోభన.

''చేసి పెట్టను, అరగంటలో తెచ్చి పెడతాను హోటల్ నుంచి'' నవ్వుతూ అన్నాడు విజయ్.

''నేను వచ్చేసరికి అందరూ స్నానాలు చేసి తయారవండి. కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ తిందాం'' స్కూటర్ బయటకు తీస్తూ అన్నాడు విజయ్.

అందరూ వెరయిటీ టిఫెన్లు తింటూ టి.వి. చూశారు. ''మధ్యాహ్నం భోజనం కూడా హోటల్ నుంచే తెస్తాను. వారం అంతా ఇంటిపని ఆఫీసు పనితో అలసిపోయావు కాబట్టి ఈరోజు నువ్వు ఫుల్ రెస్టుగా ఉండాలి'' భార్యనుద్దేశించి అన్నాడు విజయ్.

మధ్యాహ్నం భోజనాలు కూడా అయ్యాక కుటుంబ సభ్యులు నలుగురూ క్యారమ్స్ ఆడుకుంటున్నారు. విజయ్ ఏవేవో జోక్స్ చెప్పి అందర్నీ నవ్విస్తున్నాడు.

'దేవుడా నా భర్త, పిల్లలూ ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండేలా అనుగ్రహించు' మనసులో దేవుడికి దణ్ణం పెట్టుకుంది శోభన.

''తల్లిదండ్రులకీ పిల్లలకీ మధ్య బలమైన బంధాలు ఉండాలంటే వారానికి ఒక రోజైనా మనం పూర్తిగా వాళ్ళతో గడపాలండి. రోజూ ఎలాగూ వాళ్ళతో కబుర్లు చెప్పడానికి టైం ఉండదు మనకి కనీసం ప్రతి ఆదివారమైనా మన టైంని పిల్లలకోసం స్పెండ్ చేద్దాం. ఏమంటారు?'' అన్నది శోభన.

''నువ్వు చెప్పింది కరక్టే. బాల్యంలో తల్లిదండ్రుల ప్రేమని పొందని పిల్లలు అభద్రతా భావంతో పెరిగి పెద్దయ్యాక సమస్యలని తట్టుకోలేని పిరికివాళ్ళలా తయారౌతారుట'' అన్నాడు విజయ్.

శోభన దీపుని, రమ్యని కూర్చోపెట్టుకొని కథలు చెప్పింది కాసేపు. ''ఎవరో తలుపు కొడుతున్నారు మమ్మీ'' అన్నది దివ్య. ఈ వేళప్పుడు ఎవరొస్తారనుకుంటూ తలుపు తీసింది శోభన. ఎదురుగా అనంతలక్ష్మి. ఆమెని చూడగానే శోభనకి వళ్ళు మండిపోయింది. ''ఈ వేళప్పుడు వచ్చారేంటండీ.. ఏమైనా పనుందా?'' కూర్చోమని కూడా అనకుండా గుమ్మంలోనే అడిగేసింది శోభన.

''ఏమీ లేదు. కాసేపు కూర్చుందామని వచ్చాను. ఒకర్తినీ ఉంటే బోర్ కొడుతోంది'' చొరవగా కుర్చీలో కూర్చుంటూ అన్నది అనంతలక్ష్మి. అనంతలక్ష్మి- శోభనా వాళ్ళ పొరుగింట్లోనే ఉంటోంది. పెళ్ళయి రెండేళ్ళయిందిట. ఇంకా పిల్లలు లేరు. వాళ్ళాయన మెడికల్ రిప్రజంటేటివ్. సాధారణంగా ఇంట్లో ఉండడు. ఈవిడకి ఏమీ తోచక అపుడపుడూ శోభనా వాళ్ళింటికొస్తుంది.

అనంతలక్ష్మితో మాట్లాడుతున్న శోభన మనసంతా భర్తా, పిల్లల మీదే ఉంది. ఓ అరగంటసేపు ఎలాగో ఓర్చుకున్న శోభన..

''మనం మళ్ళీ కలుసుకుందామండీ. ఈరోజు నాకు ఒంట్లో బాగులేదు'' అంటూ అబద్ధం ఆడేసింది.

''అయ్యో ముందరే చెప్పారు కాదేంటండీ. ఇంత మొహమాటమైతే ఎలా. మీకు వంట్లో బాగులేదు కనుక రాత్రికి నేను వంట చేసి పంపిస్తాను. మీరు రెస్టు తీసుకోండి'' వెళ్ళబోతూ అన్నది

## దురుసుతనం

ఏవో రెండు మూడు సినిమాలు హిట్ అయితే ఇక తారలు ఆకాశంలోకి దూసుకుపోతారు. మర్డర్ చిత్రం హిట్ అయిన తర్వాత మల్లికా షెరావత్ పరిస్థితి ఇలాగే ఉంది. 75లక్షలు పారితోషికం డిమాండ్ చేస్తున్న మల్లిక తన హొయలు, ఒంపుసొంపుల వల్లే ఈ సినిమా హిట్ అయిందని కన్పించిన వారందరికీ చెబుతోంది. ఈమె దురుసుతనం గురించి తెలిసిన మహేశ్‌భట్ ఆమెని తన తరువాత సినిమాలో తీసుకునే అంశంపై తర్జనభర్జన పడుతున్నాడట. భట్‌తో పాటు ఇంకా నిర్మాతలు కొందరు ఇదే ఆలోచనలో పడ్డారుట.



అనంతలక్ష్మి.

''వద్దండీ, మావారు బయట డిన్నరు చేద్దామన్నారు'' కంగారుగా అన్నది శోభన.

''ఎందుకండీ డబ్బు దండగ. పైగా బయట తిళ్ళు ఆరోగ్యానికి మంచిది కాదు'' శోభన వద్దని చెబుతున్నా రాత్రికి వంట చేసి పంపిస్తానని గట్టిగా చెప్పి వెళ్ళిపోయింది అనంతలక్ష్మి.

ఆవిడ పంపిన సాంబారూ, ఆలూ కుర్మా అద్భుతంగా ఉన్నాయంటూ మెచ్చుకున్నాడు విజయ్. శోభనకి కూడా ఆవిడ వంట చాలా నచ్చింది. కానీ ఆవిడ అతి చనువు చూపిస్తోందన్న కోపం కూడా వచ్చింది.

★ ★ ★

శోభనా విజయ్ ఇద్దరూ ఉద్యోగస్తులే. విజయ్ ఎలాగూ లేట్‌గా వస్తాడు ఇంటికి. పిల్లలు ముందరే వచ్చేస్తారు కాబట్టి వాళ్ళకొక డూప్లికేట్ కీ ఇచ్చి తన దగ్గర ఇంకొక కీ ఉంచుకుంటుంది శోభన. నాలుగింటికే ఇంటికొచ్చేసే పిల్లలు, శోభన వచ్చేవరకూ హోంవర్క్ చేసుకుంటూ గడిపేస్తారు. శోభన వచ్చాక వాళ్ళకి పాలు కలిపి ఇచ్చి టిఫిన్ చేసి పెడుతుంది.

ఆరోజు శోభనా వాళ్ళ పై ఆఫీసరు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోతుండడంతో పార్టీ అరేంజ్ చేశారు ఆఫీసులో. తను రావడం లేట్ అవుతుంది గనక విజయ్‌ని ముందుగానే ఇంటికొచ్చి పిల్లల్ని చూసుకోమంది శోభన. సరేనన్నాడు విజయ్. కానీ పార్టీ మధ్యలో ఆఫీస్‌కి ఫోన్ చేశాడు విజయ్. తనకి అనుకోని పని తగిలిందనీ ఇంటికెళ్ళడం కుదరదని. శోభనకి ఇంట్లో బిక్కు-బిక్కుమంటున్న పిల్లలే కనిపించారు మనసులో. పార్టీకి అంటెండైందన్న మాటే కానీ మనసంతా పిల్లల చుట్టూ తిరుగుతూనే ఉంది. పాపం పాలు కలుపుకుని కూడా తాగడం చేతకాదు వాళ్ళకి. ఆకలేసినా తనెళ్ళే వరకూ అలాగే కూర్చుంటారు అనుకునేసరికి దుఃఖం వచ్చింది. నోటి దగ్గర పెట్టుకున్న స్వీటు ప్లేటులో పెట్టేసింది. ఎలాగో పార్టీ అయి ఇంటికొచ్చేసరికి ఎనిమిది అయింది. ఇంటికొస్తూనే తాళం వేసున్న ఇంటి తలుపుల్ని చూసి ఆశ్చర్యపోయింది శోభన. ఇప్పటివరకూ పిల్లలు ఇంటికి రాలేదా లేకపోతే వచ్చి ఇంకెక్కడికైనా వెళ్ళారా? అయినా పసిపిల్లలు ఎక్కడికని వెడతారు అనుకుంటుండగానే- అనంతలక్ష్మి ఇంటి నుంచి పరుగెత్తుకొస్తున్న పిల్లలు కనిపించారు. ఇద్దరూ శుభ్రంగా తయారై ముత్యాల్లా ఉన్నారు.

''మమ్మీ మరేమో మేమిద్దరం హోం వర్క్ రాసుకుంటుంటే ఆంటీ వచ్చి మీ మమ్మీ ఇంకా రాలేదేంటని అడిగింది. మా మమ్మీకి ఆఫీసులో పార్టీ ఉందనీ, లేట్ అవుతుందనీ చెప్పాం. అప్పుడు ఆంటీ నన్నూ తమ్ముడినీ వాళ్ళింటికి తీసుకెళ్ళి అక్కడే ఫ్రెష్ అప్ అవమంది. మేం అక్కడే స్నానం చేశాం. ఆంటి ఏమో టిఫిన్ చేసి పెట్టింది. స్వీట్లు పెట్టింది'' కళ్ళు చక్రాల్లా తిప్పుతూ చెప్పుకుపోతోంది దివ్య.

ఎదురుగా నవ్వుతూ అనంతలక్ష్మి. పిల్లలని ఆకలితో మాడ్చకుండా రక్షించినందుకు అనంతలక్ష్మి పట్ల కృతజ్ఞత కలిగినా ఆ కృతజ్ఞత కొంత ఇబ్బందిగా కూడా అనిపించింది శోభనకి.

''మీ సహాయానికి చాలా థాంక్స్. కానీ మిమ్మల్నొక విషయం అడగొచ్చా'' అన్నది శోభన.

''అడగండి'' నవ్వింది అనంతలక్ష్మి.

''మీరు నాకు బంధువు కాదు. మనకి కనీసం పూర్వపరిచయం కూడా లేదు. కానీ మీరు ఎందుకు మా మీద ఇంత ఇంట్రస్టు చూపిస్తున్నారు?'' ''ఇప్పుడు కాదు.. మీరు తీరుబాటుగా ఉన్నప్పుడు చెబుతాలెండి'' అనేసి వెళ్ళిపోయింది అనంతలక్ష్మి.

తను కొంచెం రిజర్వ్‌డ్ మనిషి. ఇలా అతి చనువు చూపించే మనుషులంటే తనకి ఇష్టం ఉండదు. ఈ సంగతి ఎలాగైనా అనంతలక్ష్మికి తెలియచేయాలి అనుకుంది శోభన.

★ ★ ★

ఆఫీసు పని ముగించుకొని ఇంటికి బయల్దేరబోతూంటే వచ్చిందా కబురు. వింటూనే భయంతో బిగుసుకుపోయింది శోభన.

శోభనా వాళ్ళుండే ఫ్లాట్స్‌లో ఫైర్ యాక్సిడెంట్ జరిగిందట. ఎవరో ఆఫీస్‌కి ఫోన్ చేసి చెప్పారు. నాలుగింటికే ఇంటికొచ్చిన పిల్లలు ప్రమాదంలో చిక్కుకున్నారేమో..వాళ్ళకేదయినా అయితే..ఆ పైన ఊహించడానికే భయంవేసి కుప్పకూలిపోయింది శోభన.

మనసంతా టెన్షన్..ఆందోళనా..

''నీ పిల్లలకేం కాదు ధైర్యంగా ఉండు'' ఓదారుస్తున్నారు కొలీగ్స్.

అదిరే గుండెలని చిక్కబట్టుకొని ఆటో దిగింది శోభన. అక్కడ అంతా గందరగోళంగా ఉంది. జనం గుంపులుగా పోగయి ఉన్నారు. అప్పటికే ఫైర్ సర్వీసు వాళ్ళు మంటలనార్పేశారు కానీ ప్రమాదం వల్ల నష్టం బాగానే జరిగిందంటున్నారు అక్కడి వాళ్ళు. 'ఎవరో పిల్లలట పాపం బాగా వళ్ళు కాలిందట' ఎవరో అనుకుంటున్న మాటలు శోభన చెవినపడ్డాయి. కీడు శంకిస్తున్న మనసుని నియంత్రించుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ తన గుమ్మంలో అడుగు పెట్టింది శోభన. సగం కాలిన ఫర్నీచరూ, డోర్, విండో కర్టెన్స్‌తో ఇల్లంతా బీభత్సంగా ఉంది. పిల్లల స్కూలు బ్యాగులు చూడగానే శోభనని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. సంగతి తెలిసి విజయ్ కూడా వచ్చాడు.

''ఏమండీ మన పిల్లలు'' భర్తని పట్టుకుని భోరుమని ఏడ్చింది శోభన. విజయ్ కూడా దుఃఖంతో మాట్లాడలేకపోతున్నాడు.

''మమ్మీ, డాడీ'' అన్న పిలుపులు వినగానే చటుక్కున తలతిప్పి చూశారు శోభనా, విజయ్‌లు.

''దీపూ, దివ్యా మీకేం కాలేదుగా'' పిల్లలిద్దర్నీ అక్కున చేర్చుకుంటూ అన్నది శోభన.

''మాకేం కాలేదు. కానీ పాపం ఆంటీ చేతులే కాలిపోయాయి'' అన్నాడు దీపూ.

''ఆంటీకేమైంది దీపూ'' ఆతృతగా అన్నాడు విజయ్.''మనింట్లో మంటలొచ్చి నేనూ దీపూ ఏడుస్తూంటే ఆంటీ వచ్చింది మమ్మీ. మమ్మల్నిద్దర్నీ చెరోవైపూ ఎత్తుకొని బైటికి పరుగెత్తింది ఆంటీ. అప్పుడు మన డోర్ కర్టెనేమో కాలుతూ వచ్చి ఆంటీ చెయ్యి మీద పడి ఆంటీకి చెయ్యి కాలింది'' భయంగా చెపుతోంది దివ్య.

అనంతలక్ష్మి పట్ల కృతజ్ఞతతో కళ్ళనీళ్ళు వచ్చాయి శోభనకి.''ఆంటీని అంకుల్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు మమ్మీ'' అన్నాడు దీపూ.

విజయ్, శోభనలు అనంతలక్ష్మిని చేర్చిన హాస్పిటల్‌కి వెళ్ళారు. చేతికి బాండేజీలు ఉన్నా, కాలిన గాయాలు బాధిస్తున్నా అదే నవ్వుతో అనంతలక్ష్మి- అతి చనువు తీసుకున్నానా మీ పిల్లల్ని రక్షించి అన్నట్టుగా.ఎన్నో రకాలుగా తన కృతజ్ఞతలు తెలియచేయాలనిపించింది శోభనకి. కానీ ఒక్క మాట నోరు పెగిలి రాలేదు- ఒక్క కన్నీరు తప్ప.

''చాలా థాంక్స్ అండీ మీకు. మీరే కనక సాహసం చేసి మా పిల్లల్ని రక్షించకపోతే మేము ఏమైపోయేవాళ్ళమో. ఈ జన్మంతా మీకు రుణపడి ఉంటాం'' చేతులు జోడిస్తూ అన్నాడు విజయ్.

అప్పుడు నోరు తెరిచింది అనంతలక్ష్మి- ''చూడండి శోభనగారూ! మనిషిని మనిషి ప్రేమించాలి, ప్రేమించి తీరాలి. ఇది యూనివర్సల్ రూల్. విశ్వమానవ శ్రేయస్సుకి అది మూల సూత్రం. మనిషిని మనిషి కాకపోతే ఎవరు ఆదుకుంటారు చెప్పండి. మీరు నన్నొకసారి అడిగారు నేను మీకు బంధువునా, స్నేహితురాలినా అని. నిజమే కానీ అంతకన్నా దగ్గరి బంధుత్వం- మనుషులందరినీ కలిపే బంధుత్వం.. అదే మానవత్వం. ఆ బంధుత్వంతోటే నేను మీకు సహాయం చేశాను. కుటుంబంలో బంధాలు బలంగా ఉండాలంటే కుటుంబ సభ్యులందరి మధ్యా కమ్యూనికేషన్ బాగుండాలి. అదే సూత్రం సమాజానికీ వర్తిస్తుంది. కాదంటారా..రేపు నాకు అవసరం పడితే మీరు సాయం చేయరా?''

''తప్పకుండా చేస్తా..మీకే కాదు నా చేతనైనంతలో అందరికీ చేస్తా'' మనస్ఫూర్తిగా అన్నది శోభన.

☆